# కానుక

రావినూతల సువర్ణా కన్నన్



ధనుర్మాసపు శీతగాలులు సన్నగా వీస్తున్నాయి.

శివరామయ్యగారింటి ముందు ఆయన మనుమరాలు జానకి వాకిలంతా చక్కగా ఊడ్పించి పచ్చని కళ్ళాపు జల్లించి ఆ రోజు మధ్యాహ్నం పుస్తకంలో చూసి నేర్చుకున్న ముగ్గు వెయ్యాలని సతమతమౌతోంది.

పనిపిల్ల చంద్రి అప్పటికే ఆ ముగ్గును నాలుగుసార్లు చెరిపి నీళ్ళు జల్లింది. ముగ్గు కుదరక. అయిదవసారి కాబోలు ఇద్దరి శ్రమ ఫలించి ముగ్గు బాగా కుదిరింది.

ముగ్గు డబ్బా చంద్రి చేతికిచ్చేసి, అలా పైకి దోపిన పరికిణీ కుచ్చెళ్ళు తీసి ఓసారి దులిపి, అన్ని కోణాల్లోంచీ తన ముగ్గు ఎంత బాగా కుదిరిందీ చూసుకుని,

'చాలా బాగా వచ్చింది సుమా!' అన్నట్టు సంతృప్తిగా తలపంకించి ఇంట్లో కొచ్చింది జానకి.

"అయ్యాయా తల్లీ! నీ రంగవల్లులు?" కొట్టి నట్టే అడిగింది జానకి మేనమామ భార్య శారద.

"ఆ!....అయిపోయిందత్తా!...." శారద కేసి చూడకుండానే ముగ్గుల పుస్తకం పట్టుకుని గదిలోకి నడిచింది జానకి.

జానకి అంత తాపీగా జవాబు చెప్పడం శారదకి నచ్చలేదు. అందుకే—

"ఇందాకట్నించీ చూస్తున్నాను నీ వరస! ఆ ముగ్గు మొదలుపెట్టి రెండు గంటలైంది.


ముగ్గు వంకతో కూర్చోవడం కాకపోతే, ఇంతోటి ముగ్గూ ఆ చంద్రి వెయ్యలేదా?'' అంది కోపంగా.

"ఇప్పుడేమైందత్తా?....తన సహజ ధోరణిలో నవ్వుతూ అంది జానకి.

"ఏమైందా?....ఇక్కడ చాకిరీతో నేను ఛస్తున్నాను. ఆ పాలేరు వెధవకి అన్నం పెట్టి వచ్చేలోగా ఈ బాబిగాడు గుక్కపట్టాడు. మీ మామయ్యకి కాఫీ కావాలంటూ పొలం నుంచి సుబ్బడు తయారు! కొంప నిండా జనం ఉన్నా ఇటు పుల్ల తీసి అటు పెట్టేవారు లేరు!....ఒక్కదాన్ని ఎన్నింటికి చావను?'' శారద తన కోపాన్నంతా మాటల్లోనే స్పష్టం చేసింది.

"ఇదో అత్తా! ఇంక నేనొచ్చేశాగా. నాకు చెప్పు క్షణాల్లో చేసేస్తాను ఏ పనైనా!'' అని, చంద్రికేసి తిరిగి—

"ఇదిగో చంద్రీ! ఆవు పేడంతా జాగ్రత్తగా తీసుంచు! తెల్లవారు ఝామున ఆ కాంతమ్మ పిల్లిలా వచ్చి మొత్తం పట్టుకుపోతుంది!....మన కింక గొబ్బెళ్ళే ఉండవు!'' అంటూ దానికా పని పురమాయించేసి—"ఆఁ!....ఇప్పుడు చెప్పత్తా! ఏం చెయ్యాలి? బాబిగాడికి స్నానం చేయించనా?''





దీపావళి నవలా రచనల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన నవల

చిరునవ్వుతో అంది జానకి.

"వద్దులే తల్లీ! ఇంకా నీ పనేవన్నా ఉంటే చూసుకో! వాడికి స్నానం చేయించి రెండు గంటలైంది! ఈ శీతగాలిలో వాడికిప్పుడు నీళ్ళు పొయ్యడం మీ మామయ్య చూస్తే....ఇంక నన్ను బ్రతకనివ్వరు!''

మూతి మూడు వంకర్లు తిప్పుతూ, బాబిగాణ్ణి చంకనేసుకుని పెరటివైపుకి వెళ్ళిపోయింది శారద.

## 2

రాజమ్మ శివరామయ్యగారలకు నలుగురు మొగపిల్లలు, ఒక ఆడపిల్ల.

పెద్దకొడుకు కామేశం హైద్రాబాద్‌లో ఉన్న ఓ ప్రైవేట్ కంపెనీలో ఇంజనియర్!....భార్య భవాని కాస్త నోటి దురుసుగల మనిషి!

వారికి విఠల్, సూర్యం, ఇందిర, వాసంతి సంతానం. విఠల్‌కి మతిస్థిరం లేదు! మిగతా ముగ్గురూ తెలివిగలవారే అయినా పెద్దకొడుకు విఠల్ గురించి కామేశం దంపతులకి పెద్ద బెంగగా ఉండేది.

శర్మ, కమల శివరామయ్యగారి రెండవ కొడుకు, కోడళ్ళు....దుర్గ వారి ఏకైక సంతానం!

ఇంక రామచంద్రం, అహల్య మూడవ కొడుకు కోడళ్ళు. వారి సంతానం ప్రమీల.

ఆఖరివాడు గోపాలం. అతని భార్య శారద! వారికి నలుగురు మగపిల్లలు.



"పుట్టింది 'లంకలకలవేగురుకు' అనే గ్రామంలో. మెట్టింది బందరులోని 'రావి మూతల'వారి వంశంలో. నా పేరు 'సువర్ణ'. అయినా, నాకెందుకనో 'సువర్న' అనే రాయాలనిపిస్తుంది. అలాగే రాస్తున్నాను; రాయమని అందర్నీ కోరుతున్నాను.

శ్రీవారు వృత్తిరీత్యా వైద్యులు. వారి సహకార ప్రోత్సాహంతోనే నేను రచనలు చేస్తుంటాను. నాకు ఇద్దరు మగపిల్లలు.

పెద్ద బాబు చంద్రశేఖర్ బి.టెక్ పూర్తి చేశాడు. చిన్నబాబు రవిసుందర్ బి.యస్సీ చదువుతున్నాడు.

సాహిత్యంలో అభిరుచితోపాటు సంగీతమన్నా, పాటలన్నా నాకు చాలా ఇష్టం.

రాసినవి తక్కువైనా దాదాపు అన్ని పత్రికలలోనూ నా కథలు ప్రచురించబడ్డాయి! కొన్ని రేడియో నాటకాలు ప్రసారమయ్యాయి.

నా నవలకు బహుమతి రావడం ఇదే ప్రథమం."

సువర్నా కన్నన్

మిగతా ముగ్గురూ పట్నాల్లో ఉద్యోగరీత్యా స్థిరపడినా గోపాలం మాత్రం పొలాలు చూసుకుంటూ పల్లెనంటి పెట్టుకునే ఉన్నాడు.

నలుగురు మగపిల్లల తరువాత పుట్టిన సుగుణంటే ఆ ఇంట్లో అందరికీ ప్రాణం! పైగా అందాలరాశి. అందుకే ఆమె ఊరివారందరి అభిమానానికి పాత్రురాలై ముద్దు బిడ్డగా పెరిగింది.

మునిపల్లె ఓ పెద్ద గ్రామం.

ఊళ్ళో అందరికీ పెద్ద తలకాయ శివరామయ్యగారు! ఆయన మాట వేదవాక్కుగా భావించేవారు. ఆయన పరోపకార బుద్ధి, దైవచింతన తెలిసినవారు ఆయన్ని మరో దైవంగా భావించి గౌరవించేవారు.

సుగుణకి చిన్నతనంలోనే పెళ్ళిచేసి పంపేశారు. వరునిది పక్క గ్రామమే కనుక అడపా దడపా ఆమె వచ్చి పోతూండడం మూలాన ఆమె లేని లోటు అంతగా కనిపించేది కాదు.

అల్లుడికి పెద్దగా ఆస్తిపాస్తులు లేకపోయినా, సత్సాంప్రదాయంలో పుట్టినవాడూ, బుద్ధిమంతుడూ అనుకున్న శివరామయ్యగారు నిస్సంకోచంగా కన్యాదానం చేసేశాడు.

సుగుణ పెళ్ళయిన నాలుగేళ్ళ తరువాత పుట్టింది జానకి. ఆ తరువాత మరి కాన్పు రాలేదు సుగుణకి.

జానకి ఆరేళ్ళ వయస్సులో ఉండగా సుగుణకి హఠాత్తుగా జ్వరం తగిలి రెండు మూడు రోజుల్లోనే పసిబిడ్డని దిక్కులేని దాన్నిగాచేసి, ఈ లోకం నుంచి శాశ్వతంగా నిష్క్రమించింది.

సుగుణ భర్త మాత్రం 'టింగు రంగా' అంటూ మర్నాడే పెళ్ళి పీట ఎక్కి కూర్చుని గయ్యాళి లాంటి ఇల్లాల్ని తెచ్చి, జానక్కి తల్లి ప్రేమే కాక తండ్రి ప్రేమ కూడా కరువు చేశాడు.

ఉన్న ఒక్కగానొక్క కూతురు పోవడంతో కృంగిపోయిన శివరామయ్య దంపతులు, మనుమరాల్ని సవతితల్లి పెట్టే అరళ్ళు చూసి మరీ క్రుంగిపోయారు.

వెంటనే ఓ నిర్ణయానికొచ్చి అల్లుణ్ణి బ్రతిమాలి జానకిని తమ దగ్గరికి తీసుకొచ్చేశారు.

వదిలించే చాలనుకున్న సవితల్లి కూడా వెంటనే అంగీకరించి, జానకిని తాతగారి వెంట పంపేసింది.

కొన్నాళ్ళపాటు అమ్మమ్మగారింట్లో అపురూపంగానే పెరిగింది జానకి.

మేనమామలు, భార్యాపిల్లలు పండగలకి పబ్బాలకీ వస్తూ పోతూంటే ఆ పిల్లకి ఎంతో సరదాగా ఉండేది.

కాల రథచక్రాల కింద శివరామయ్యగారు పడి నలిగిపోయి సంసారాన్ని అస్తవ్యస్తంగా చేసి పోయాడు.

పోయే ముందు జానక్కేదో అర్థికమైన అండ చూపాలనుకున్న ఆయన కోరిక కోరిగ్గానే మిగిలిపోయింది.

అప్పట్నించీ జానకి జీవితంలో మార్పు కొట్టొచ్చినట్టు కనబడింది!

అమ్మమ్మ అధికారం అంతరించి అత్తల అధికారం చిగురించింది. అత్తల మాటలకి మామయ్యలు నోరెత్తలేరు!

శలవులకి పిల్లలతో వచ్చిన వారందరికీ జానకి ఒక పనిపిల్ల;

పెద్దత్త భవాని బస్తీ నుంచి జానక్కి రిబ్బన్లనీ, గాజులనీ తెచ్చి ఇస్తూండేది. దానికే జానకి తెగ మురిసిపోయేది.

ఒంచిన నడుం ఎత్తకుండా ఏదో ఓపని చేస్తూనే వుండేది.

వేసంగి శలవుల్లో ఆమెకి అసలు తీరేదికాదు. ఎంతమంది పాలేళ్ళున్నా, పని మనుష్యులున్నా, జానక్కి రెండు చేతులా పనుండేది.

చిన్నపిల్లలకి నీళ్ళు పొయ్యడం. దాకింటి బట్టలు సర్దడం, పాలు తీయించడం, మజ్జిగ చిలికి వెన్న తియ్యడం ఇవన్నీ జానకే చేస్తుంది.

తను కాకపోతే ఈ పన్లన్నీ అమ్మమ్మే చెయ్యాలి. ఆవిడ చేత ఈ పన్లు చేయించడం ఇష్టం లేని జానకి తనే చేసేస్తుంది.

నిండా పదిహేనేళ్ళు లేని ఆడపిల్ల విసుగూ విరామం లేకుండా అన్నిపన్లు చేస్తుంటే అంతా ఆశ్చర్యంగా చూసేవారు. అందుకే ఆ వూరివారందరికీ జానకంటే ఓ రకమైన అభిమానం!

ఇప్పుడు సంక్రాంతి శలవులకి శివరామయ్యగారి కొడుకులు, కోడళ్ళు, మనుమళ్ళు, మనుమరాళ్ళు, రావడంతో ఇల్లంతా చాలా సందడిగా వుంది.

తను పనితో ఎంత సతమతమౌతున్నా ఇలా అందరూ కలిస్తే జానక్కి చెప్పలేనంత ఆనందం! ఒంటరితనంతో విసిగిపోయిన ఆమె ఈ రోజుల కోసం ఎంతగానో ఎదురు చూసేది!

ఎవరెంత పౌరుషంగా మాట్లాడినా చిరునవ్వే సమాధానంగా వచ్చేది జానకి లేత పెదవుల నుంచి.

"అత్తా! ఈ రోజు అందరి వాకిళ్ళలోని ముగ్గుల కన్నా మన వాకిట్లో ముగ్గే ఎంతో బావుంది!... అసలు నువ్వు చూశావా? కొత్తముగ్గత్తా! నిజం! ఇంతవరకు మన వూళ్ళో ఎవ్వరూ వెయ్య లేదు!"

ఉత్సాహంగా చెప్తున్న జానకిని, చూసి కాస్త సిగ్గుపడింది శారద.

ఇందాక అన్ని తిట్లుతిని, అవి వెంటనే మర్చిపోయి, చకచక పన్లన్నీ ముగించి అమాయకంగా ముగ్గును గురించి అడుగుతున్న ఆ పిల్లని సూటిగా.

చూడలేకపోయింది కూడా. కానీ వెంటనే తేరుకుని కుతూహలంగా చూస్తూ, "అవును ! జానీ! ముగ్గు చాలా బావుంది! అదిసరే ఇంత పెంద్రాళే వేశావ్ కదా ఎవ్వరూ తొక్కరూ?" చిరునవ్వుతో అడిగింది.

"పో అత్తా! ఎవ్వరు తొక్కుతారు అంత తెల్లగా ముగ్గు కనిపిస్తూంటే ?. అయినా మన వాకిలి మరీ రోడ్డు మీద లేదుగా ! ఇటెవరూరారు. ఇదిగో అత్తా ! మాట ! గట్టిగా అరవకు అమ్మమ్మ వింటుంది. మన చంద్రిలేదూ—దాన్ని అక్కడ కాపలా పెట్టాను ఎవరూ తొక్కకుండా చూడమని!" రహస్యం చెప్పినట్టు చెప్పి అమ్మమ్మ పిలుపు వినిపించడంతో ఒక్క అంగలో హాల్లోకొచ్చింది జానకి.

మర్నాడు జానకి సంధ్య గొబ్బిళ్ళు పెట్టి స్నేహితులందర్నీ పేరంటం పిల్చింది.

పెద్ద మామయ్య కూతుళ్ళు ఇందిర, వాసంతి, చిన్న మామయ్య కూతురు దుర్గ, మూడో మామయ్య కూతురు ప్రమీలా, ఇంకా వూళ్ళోని కన్నెపిల్లలు, అంతా గొబ్బెమ్మల చుట్టూ చేరారు.

ఇందిరా వాళ్ళకీ పేరంటమంటే చాలా సరదా. పట్నాల్లో ఇలాంటి వేడుకలు తక్కువ.

ఒక పీటమీద మూడు పెద్ద గొబ్బెళ్ళు చేసి పెట్టి పసుపు, కుంకుమలు, పూలతో అలంకరించారు.

అమ్మమ్మ పూజ అదీ చేయించాక,

"ఆఁ! గొబ్బి తట్టండర్రా!" అంది పిల్లల్తో.

ఆవిడ మాటకి పిల్లలంతా మాసిముసిగా నవ్వుకుంటూ గొబ్బిళ్ళచుట్టూ తిరుగుతూ పాట మొదలు పెట్టారు.

ఆడపిల్లల్లేని శారద కూడా సరదాగా ఆ వేడుక చూస్తూ నిల్చుంది.

సుబ్బీగొబ్బెమ్మా! .... సుబ్బణ్ణియ్యవే
చామంతి పువ్వంటీ చెల్లెల్నియ్యవే
తామరపువ్వంటీ మరిదినియ్యవే
మల్లెపువ్వంటీ .... మొగలిపువ్వంటీ...." పక పకలాడుతూ పాట ఆపేశారు పిల్లలు.

ఊఁ! కానీండర్రా!" మురిపెంగా విసుక్కుంది రాజమ్మగారు.

" మొగలిపువ్వంటే .... మొగుణ్ణియ్యవే...." నవ్వుతూ, తుళ్ళుతూ పాట పూర్తి చేశారు.

## లోకజ్ఞానం

1. 'ది పోర్సిలైన్ టవర్' లేక 'పింగాణీ శిఖరము' ఎక్కడ వున్నది ?
2. పతంజలి ఎవరు ?
3. సాహిత్యంలో ఈ సంవత్సరపు నోబెల్ బహుమతి ఎవరికి లభించింది?
4. ఈ మధ్య శ్రీలంకలో అత్యధిక మెజారిటీతో అధ్యక్షుడుగా ఎన్నికైన వ్యక్తి పేరేమిటో చెప్పగలరా ?
5. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన స్త్రీల క్రీడోత్సవాలలో జిమ్నాస్టిక్స్‌లో జాతీయ ఛాంపియన్‌షిప్ గెలుపొందినవనిత ఎవరు ?
6. సూర్యుడికి, భూమికి మధ్యగల సగటుదూరం ఎంతో చెప్పగలరా ?
7. కేరళ రాష్ట్రానికి గవర్నర్‌గా నియమితులైన వ్యక్తి ఎవరు ?
8. ఎలక్ట్రో కార్డియోగ్రాఫ్‌ని కనుగొన్న దెవరు ?
9. మనం ఫొటోలకి ఉపయోగించే ఫొటోగ్రాఫిక్ పేపర్‌ని ఎవరు కనుగొన్నారో చెప్పగలరా ?
10. మద్రాసు, బొంబాయి, కలకత్తా విశ్వవిద్యాలయాలు ఒకే సంవత్సరంలో స్థాపించబడ్డాయి. మరి అది ఏ సంవత్సరం? ఆ సంవత్సరమే భారత స్వాతంత్ర్యోద్యమానికి సంబంధించిన మరో ముఖ్య సంఘటన జరిగింది. అది ఏమిటి ?

[సమాధానాలు ఈ సంచికలోనే వున్నాయి. వెతికి మీ సమాధానాలతో సరిపోతాయేమో పోల్చి చూసుకోండి]

చక చక అందరికీ పసుపూ కుంకుమలందించి, పళ్ళూ ప్రసాదాలు పంచింది జానకి.

పేరంటాలంతా వెళ్ళిపోయాక అన్నీ సర్దించేసి తన గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకుని విప్పిన పట్టులంగాని మడిచి పెడుతున్న జానకి తృళ్ళిపడి వెనుతిరిగింది.

అక్కడ పెద్ద మామయ్య కొడుకు సూర్యం చేతిలో ఓ ఉమ్మెత్తకాయ పట్టుకుని చిలిపిగా నవ్వుతున్నాడు.

"ఏయ్ ! ఏమిటిది ?...." మెడమీద చేత్తో రాసుకుంటూ అంది జానకి.

"ఉమ్మెత్తకాయ !...." తాపీగా అన్నాడు సూర్యం.

"అయితే ?....నా మెడమీదెందుకు గుచ్చావ్ ? అబ్బ చూడు ! ఎంత బొబ్బెక్కిపోయాయో !...." నిష్ఠూరంగా అంది జానకి.

"ఏదీ....చూణ్ణీ!...." అంటూ దగ్గరికి చేరి మరోసారి మెల్లగా ఉమ్మెత్తకాయతో గుచ్చాడు సూర్యం.

"ఇదిగో మళ్ళీ!....అయినా నీకిదేం బుద్ధి ! వుండు అత్తతో చెప్తా!" చెంగున గడపదాటబోతున్న జానకిని చెయ్యడ్డుపెట్టి ఆపాడు సూర్యం.

"కాదు జానీ! నీకు మొగలి పువ్వులాంటి మొగుడు కావాలన్నావ్‌గా ? అంటే .... బాగా ముళ్ళుండాలన్న మాట !.... కానీ నాకు పెద్ద గోళ్ళైనాలేవే ! అందుకే ఈ కాయ తెచ్చాను!.... మరి నన్ను చేసుకుంటావా ?" చిలిపిగా అడిగాడు సూర్యం.

"ఛీ ! పో బావా !" పదిహేనేళ్ళ జానకి సిగ్గుల మొగ్గయిపోయి చెంపలు కందిపోగా, ఒక్క ఉదుటున బైటపడింది.

సూర్యం మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తుండగా అమ్మమ్మ ప్రక్కన చేరింది.

"అమ్మమ్మా"

"ఏమ్మా ! జానీ ?...." ఆప్యాయంగా ఆ పిల్ల చెయ్యి పట్టుకుని తన పక్కనే కూర్చో పెట్టుకుంటూ అడిగింది రాజమ్మగారు.

"ఆదే....ఆదే అమ్మమ్మా ! మొగలిపువ్వు

లాంటి భర్త కావాలని ఎందుకు కోరుకుంటారు?''
చక్రాల్లాంటి పెద్ద కళ్ళనిండా కుతూహలం నింపుకుని అడుగుతున్న మనుమరాల్ని మురిపెంగా చూసింది రాజమ్మగారు.

''అవునమ్మా! మగవాడు మొగలిపువ్వులా ముళ్ళతో వాడిగా వుండాలి. అంటే ఆడదానికి విధేయుడై ఉండకూడదన్నమాట! అలా అని తుమ్మముల్లులానూ ఉండకూడదు! చిన్నముళ్ళతో ఆకర్షణ కలిగి సువాసనలు వెదజల్లుతూ ఉండాలి! అంటే....పైకి ముళ్ళలో వాడిగా కనిపించినా మనసు సున్నితంగా ఉండి సువాసనలు వెదజల్లుతున్నట్టుండాలి. అవసరం అయితే ఆ ముళ్ళనే ఆయుధాలుగా ఉపయోగించి, కన్నవార్ని కాపాడు కోగల శక్తివంతుడై వుండాలి! అందుకే మల్లెలా సున్నితంగా ఉండక మొగలిపువ్వులా వాడిగా, పరిమళభరితమైనట్టున్న భర్త కావాలని ప్రతి కన్నె కోరుకుంటుంది.''

మనుమరాలి సందేహం తీర్చింది రాజమ్మగారు! ఆ రోజు తియ్యని కలలెన్నో కని పరవశించి పోయింది జానకి.

మొగలి పువ్వులాంటి భర్త కలలో కనిపించి కితకితలు పెట్టేశాడా కన్నె మనసుని.

## 3

సాయంకాలం నాలుగు కావస్తోంది. కాఫీలు, టిఫిన్లు అయిపోయి అంతా హాల్లో కూర్చుని కబుర్లలో పడ్డారు. జానకి, ఇందిర, వాసంతి ఓ మూలగా కూర్చుని చింతగింజలు ఆడుతున్నారు. జానకి ఆట ముందు మిగతా ఇద్దరికీ ఆ ఆట అసలు రానట్టే లెఖ్ఖ అయినా ఆడడం మానరు.

పట్నంలో పెరిగినవారికి కేరమ్స్, చెస్‌లాంటివి తప్ప ఇలాంటి ఆటలు రావు. అందుకే ఇక్కడికి వచ్చినప్పుడల్లా తప్పకుండా ఆడతారు.

పట్నంలో యాంత్రిక జీవితానికి అలవాటుపడ్డ ఇందిరావాళ్ళకి ప్రశాంతంగా ఉండే ఈ పల్లె అంటే చాలా ఇష్టం.

అదీగాక ఇక్కడ బామ్మ ఏ దడిగినా కాదనదు. ముంజలు, తేగలు, జున్ను ఏ కాలంలో వచ్చేవి ఆ కాలంలో తినచ్చు. శెలవులు నాలుగు రోజులు స్వేచ్ఛావిహంగాల్లా తిరుగుతారందుకే.

ఆడవాళ్ళంతా కబుర్లలో పడ్డారు.

చంద్రి సామాన్లు తోముతోంది పెరట్లో.

రాజమ్మగారి కొడుకులు వరండాలో కూర్చుని ఏవో పొలాల గురించి మాట్లాడుకుంటున్నారు.

వాతావరణం అనుకూలంగా ఉందనుకున్న పెద్ద కోడలు విషయం మెల్లగా కదిపింది అత్తగారి దగ్గర.

''అత్తయ్యా! జాని పెద్దమనిషై మూడేళ్ళు కాలా?'' అంది నాందీ వాక్యాలుగా.

''అవును భానూ! రేపు చైత్రానికి మూడు కూడా నిండుతాయి. ఏమిదో! ఆ తల్లే బ్రతికుంటే అచ్చట్లు ముచ్చట్లు చూసుకుంటూ సంబంధాలకోసం తిరిగే వయస్సు! కొనగోటితో కన్నీరు తుడుచుకుంటూ అంది రాజమ్మగారు.

''ఆ! ఇప్పుడు మాత్రమేమైందత్తయ్యా! మనమంతా ఉండి దానికి లోటు రానిస్తామా?''

''నిజమే భానూ! అదే నా ధైర్యమూను! హేమాహేమీల్లాంటి నలుగురు మేనమామలున్నారు. తండ్రి పట్టించుకోకపోతే మాత్రమేం? వారే కంటికి రెప్పలా చూసుకుంటారు!'' మనస్ఫూర్తిగానే అంది రాజమ్మగారు.

చింతగింజలాడుతున్న జానకి తన పేరు వినిపించడంతో కుతూహలంగా ఓ చెవి బామ్మ వైపుకి ఒదిలింది.

భార్య మాటలు విన్న రాజమ్మగారి పెద్దకొడుకు కామేశం రంగప్రవేశం చేశాడు. అతన్ని చూసి మరదళ్ళు పక్కకి తప్పుకున్నారు.

''అమ్మా! ఈ వేసంగిలో మన జానీ పెళ్ళి చేసేద్దామమ్మా! దానికి మనంకాక ఎవరున్నారు? అదసలే నోట్లో నాలుక లేని పిల్ల!'' అభిమానంగా మేనకోడలివైపు చూస్తూ అన్నాడు కామేశం.

కొడుకు మాటలు విన్న రాజమ్మగారి ముఖం చాటంతైంది.

''అలాగే నాయనా! తప్పకుండా చేసేద్దాం! నీ ఎరికలో మంచి సంబంధమేమైనా ఉంటే చూడు. కట్నం ఎంతైనాసరే! మంచి సంబంధమైతే మాత్రం వదలకు!'' కొడుకు, కోడలు అలా మాట్లాడితే ఆవిడకి ఏనుగు నెక్కినంత సంతోషంగా ఉంది.

ముఖాముఖాలు చూసుకున్నారు భార్యాభర్తలు!
''ఏమిటమ్మా! జానకి పరాయిదా? నా మేనకోడలు! నా ఒక్కగానొక్క చెల్లెలి కూతురు! దాన్ని పరాయివాళ్ళకిస్తే సుగుణ ఆత్మ ఘోషించదూ? అయినా జాని మరీ అమాయకప్పిల్ల! దాన్ని ఏ దార్నపోయే దానయ్యకో ఇచ్చి మనం చేతులు



కార్పొరేటరు:
పొట్టా భారతి

శ్రీమతి పొట్టా భారతి విశాఖపట్నం కార్పొరేటరుగా మూడవ డివిజను నుండి భారతీయ జనతాపార్టీ తరపున పోటీచేసి ముగ్గురు అభ్యర్థులను ఓడించి విజయాన్ని చేపట్టారు.

బి. జె. పి. కార్పొరేటర్ల కౌన్సిల్‌కు ఉపనాయకురాలైన ఆమె తన నియోజక వర్గంలోని స్త్రీల ప్రయోజనార్థం ఒక మహిళా మండలిని (కనక మహాలక్ష్మి మహిళా మండలి) ప్రారంభించి, అదనంగా రెండు కుట్టుమిషన్లను కార్పొరేషను ద్వారా సంపాదించిపెట్టి మహిళలకు శిక్షణనిచ్చి, ఉపాధి కల్పించే ఏర్పాటు చేసారు. వారి వార్డులో నీటి యిబ్బందికి గురవుతున్న ఎగువ ప్రాంతాలకు నీటి సరఫరాను సుకరం చేసి అదనంగా బోరింగుపంపులను కూడా వేయించామని అన్నారు. వార్డులోని పిల్లలకు ఆరోగ్యపరీక్షలను, ఉచితవైద్య చికిత్సలను నిర్వహించామని అన్నారు.

తన నియోజకవర్గంలో మురికివాడ ప్రాంతమైన కంచరవీధిలోని గుడిసెలను తొలగించి, వాటి స్థానే పక్కాయిళ్ళను నిర్మించాలని, మహిళలకు స్వయం ఉపాధి కల్పనా కేంద్రం స్థాపించాలని, వార్డులోని మురికికాలువలను బాగుపరచి డ్రెయినేజీ సౌకర్యాలను అధికం చేయాలని, రీడింగురూమ్ దగ్గరలోని గుర్రపుశాల ప్రాంతంలో షాపింగు కాంప్లెక్సును ప్రారంభించాలని, కనక మహాలక్ష్మి దేవస్థానానికి వచ్చిపోయే యాత్రికులకు మంచినీటి సౌకర్యాన్ని, మరుగువసతులను ఏర్పాటు చేయించాలనేవి తన లక్ష్యాలని ఆమె అన్నారు.

—విశాఖ విలేకరి

కడిగేసుకుంటే, ఆ తరువాత దాని కాపురం బావుం డకపోతే బాధపడేదీ మనమేగా? అం....దు....కే''

నాను స్తున్న కొడుకుని అయోమయంగా చూసింది రాజమ్మగారు.

"అవునత్తయ్యా! జానకిని మన విఠల్‌కిచ్చి చేస్తే బావుంటుంది! వాడికిదంటే ఎంత ప్రాణమో! ఎప్పుడూ అంటూంటాడు. అమ్మా! జానీని మనూరు తీసుకొచ్చి చదువు చెప్పిద్దాం అని....

"అయ్యో!.. అది అమ్మమ్మ నొదిలి వుండి లేదురా అని నచ్చ చెప్పలేక చచ్చాననుకోండి! అంతెందుకు జానీకి మాత్రం?... విఠల్‌గాడంటే చచ్చే అభిమానం! ఎప్పుడూ "విఠల్‌బావా! విఠల్ బావా!'' అంటూ వాడి చుట్టూ తిరుగు తుంటుంది!''

తేనె సొనలు ఒలుకుతున్నట్టు మాట్లాడుతున్న కోడల్ని చూసి నిర్ఘాంతబోయింది రాజమ్మగారు.

ఏమిటీ?....బంగారబొమ్మలాంటి జానకిని ఆ పిచ్చివాడికిచ్చి కట్టాలా? వాడు తన మనవడైతే కావచ్చుగాక! కానీ ... తల్లిలేని, గంగి గోవులాంటి జానకిని పిచ్చివాడికివ్వమని అడిగినందుకు రాజమ్మ గారికి వాళ్ళ మీద చెప్పలేనంత కోపం వచ్చింది! కానీ తమాయించుకుని —

"అలా కాదు కామేశం! విఠల్‌కీ జానక్కీ వయసులో బాగా తేడా వుంది! ఇదా అమాయకు రాలు! వాడా మతిస్థిరం లేనివాడు! నెగ్గుకురావడం దీనివల్ల కాదు నాయనా! మనం ఏదో పరాయి సంబంధమే చూద్దాం!'' మరో ప్రశ్నకి అవకాశం ఇవ్వకుండా పెరట్లోకెళ్ళిపోయింది రాజమ్మగారు.

కామేశం ముఖం పాలిపోయింది! భవాని ముఖం మరీ నల్లగా పెంకులా అయిపోయింది!

కానీ....అవుసరం తమది కనుక కోపతాపాల్ని కాస్సేపు అవతలికి నెట్టి రాజమ్మగార్ననుసరిం చారు.

"లేదమ్మా! వాడిప్పుడు బాగానే వున్నాడు! పెళ్ళి చేస్తే అంతా చక్కబడుతుందని డాక్టరూ అన్నాడు. అయినా జానకంటే నాకు పగా? ఏదో ఇద్దరూ కళ్ళముందు పడి వుంటారని గానీ అయినా నీ మనవణ్ణి నువ్వే అలా తీసి పారేస్తే ఎలా అమ్మా!....''

కాస్త నిష్ఠూరం మరి కాస్త అనునయం కలి సిన గొంతుతో అన్నాడు కామేశం.

"నిజమే నాయనా! వాడు నా మనవడే వాడంటే నాకు ఎంతో ప్రేమ కూడాను....కానీ....తల్లి లేక, తండ్రి ఉండీలేని అది కూడా నా మనవరాలే!... దాని గొంతుకొయ్యను! .... అదీగాక ఇది ఎదురు మేనరికం అవుతుంది కూడా! ఇంక ఈ విషయం వదిలెయ్యండి!'' గట్టిగా అనేసింది రాజమ్మగారు.

దంపతులిద్దరూ ముఖాలు మాడ్చుకుని విసురుగా అవతలికి వెళ్ళిపోయారు.

పెద్దమామయ్య వాళ్ళు విఠల్ బావకి తనని చేసుకుంటాననగానే పక్కలో బాంబ్ పడ్డట్టు ఉలిక్కిపడ్డ జానకి, అమ్మమ్మ చెప్పిన సమాధానం విని తేలిగ్గా వూపిరి పీల్చుకుంది.

ఆ రోజు నుంచి ఇంట్లో రుసరుసలు ఎక్కువై పోయాయి. రాజమ్మగారి మిగతా కొడుకులు కూడా మనసులో అంతగా ఇష్టం లేకపోయినా, అన్నగారి పోరు పడలేక తల్లికి చెప్పి చూశారు, జానకిని విఠల్‌కిమ్మని.

ససేమిరా ఆవిడ ఒప్పుకోలేదు! పైగా జానక్కో మంచి సంబంధం చూసి వెంటనే పెళ్ళి చేసెయ్యా లని కూడా అనుకుంది.


*

సంక్రాంతి ఎల్లుండనగా పిల్లలంతా కలిసి శివా లయానికి వెళ్ళారు.

అక్కడ రాలిన పున్నాగపూలన్నీ ఏరి దండగా అల్లి పూజారికిచ్చింది జానకి. ఆయన ఆ దండ అమ్మవారి మెళ్ళో అలంకరిస్తుంటే తన్మయత్వంగా చూస్తూ, ఆ అమ్మవారు ఎంత మహిమ కలదో, ముఖంలో జీవకళ ఎలా తొణికిసలాడుతుందో వర్ణించి చెప్తోంది మిగతా పిల్లలకి.

"ఏమ్మా! జానకీ! ఈ రోజు ఇంత ఆలస్యంగా వచ్చేవేం? ప్రతి రోజూ క్రమం తప్పకుండా వచ్చే దానివి, ఈ మధ్య రావడమేలేదు! నీ దండల్లేక అమ్మవారు చిన్నబోయింది! ఇప్పుడు చూడు.... ఆ దండ వేశాకగానీ అమ్మవారు నవ్వలేదు!''  చిరునవ్వుతో అన్నారు పూజారి.

ఆయన మాటలక్కాస్త సిగ్గుపడింది జానకి. "కాదు తాతగారూ!...ఎల్లుండి పండుగకదూ! ఇళ్ళన్నీ కడిగి,ంచి ముగ్గులు పెట్టేసరికి ఆలస్యం అయిపోయింది! రేపు చీకటితో భోగిమంట




## కొత్త వస్తువులు

సౌందర్య సాధనాలు తయారు చేసే లాక్మేలిమిటెడ్ సంస్థ 'మెటాలిక్ మిస్టిక్' పేరిట లిప్‌స్టిక్‌లు, ఐషాడోలు, వాటికి సరి పోయే రంగులలో గ్లిట్టర్‌డస్ట్, నెయిల్ పాలిష్ వంటి కొత్త సౌందర్య సాధనాలను తయారు చేసింది. మెత్తగా, మృదువుగా వుండే గ్లిట్టర్ డస్ట్‌ని తమ సౌందర్యాన్ని ఇనుమడింప జేయడానికి విదేశాలలో వనితలు విరివిగా ఉపయోగిస్తున్నారనీ, ఈ గ్లిట్టర్ డస్ట్‌ని లిప్ స్టిక్‌తో గానీ లిప్‌స్టిక్ లేకుండాగానీ పెదవులపై రాసుకోవచ్చనీ, కనురెప్పల మీద ఐషాడో పైనగానీ, ఐషాడో లేకుండా గానీ ఉపయో గించవచ్చుననీ, చెక్కిళ్ల పైన కూడా రాసు కోవచ్చనీ, విదేశాలలో అతి ఖరీదు చేసే ఈ గ్లిట్టర్‌డస్ట్ సాధనాన్ని తాము సరసమైన ధరకు తయారు చేశామనీ, అనేక పరిశోధ నలు జరిపి తాము సౌందర్య సాధనాలు మన దేశపు వాతావరణానికీ, ఇక్కడి వనితల దేహచ్ఛాయకీ, చర్మ ఆరోగ్యానికి తగ్గట్టుగా రూపొందిస్తున్నామనీ లాక్మే నిర్వాహకులు తెలియజేస్తున్నారు.

గోల్డెన్ బ్లష్, టెర్రాబ్రాంజ్, కాపర్‌ఫైర్, బర్నిష్‌డ్ గోల్డ్ రంగులలో లభించే గ్లిట్టర్ డస్ట్ వెల రూ. 18.75 గోల్డ్‌స్ప్రే, స్టెర్లింగ్ సిల్వర్, గోల్డ్‌లీఫ్, సిల్వర్‌స్యూడ్, సిల్వర్ మిస్ట్, సిల్వర్ పాషన్ రంగులలో లభించే ఐషాడో వెల (ఒక్కొక్కటి) రూ. 15.గోల్డ్ షిమ్మర్ (నెం. 80) గోల్డ్‌ఫ్లేమ్ (నెం. 81), బ్రాంజ్ స్పార్కల్ (నెం. 82), బ్రాంజ్‌టాన్ (నెం. 83), కాపర్‌షీన్ (నెం. 84) కాపర్ గ్లో (నెం. 85) రంగులలో లభించే లిప్ స్టిక్ వెల ఒక్కొక్కటి రు. 15-90 ఈ రంగులలోనే లభించే నెయిల్ పాలిష్ వెల రు. 9-85.

వేసుకోగానే వచ్చేస్తాం!" పూజారి ఇచ్చిన తీర్థం తీసుకుంటూ అంది.

ఇంతలో పాలేరు సుబ్బడు ఉరుకులుపరుగులతో వచ్చాడు.

వాడి హడావిడి చూసిన జానకి తెల్లబోయింది.

"ఏమైందిరా! ...ఏమిటాపరుగు?...." ఆత్ర 'తగా అంది.

"మిమ్మల్నోపాలి అరిజెంటుగా రమ్మన్నారు పెదమామయ్‌గోరు!" గబగబ అన్నాడు సుబ్బడు.

"ఎందుకురా?...."

"అదేమో నాకు తెలవదు!....మీరు బేగిరండి!" వచ్చినంత వేగంగానూ వెళ్ళిపోయాడు సుబ్బడు.

వాడి ముఖంలో కంగారు చూసిన జానకి కాళ్ళూ చేతులు ఆడలేదు.

"వస్తాం తాతగారూ!" అనేసి వెనుతిరిగింది. పిల్లలామెని అనుసరించారు.

పరుగులాంటి నడకతో ఇల్లుచేరిన జానకి స్థాణువులా నిల్చిపోయింది. అక్కడి దృశ్యం చూసి ఓ క్షణం. మరుక్షణం కళ్ళు చీకట్లు కమ్మినట్లయి అక్కడే కూలబడిపోయింది.

పెద్ద వాకిలంతా జనంతో నిండిపోయింది. వరండాలో మధ్యాహ్నం గంట శ్రమపడి తను వేసిన ముగ్గు, ఆ ముగ్గు మధ్యగా తన ఏకైక శ్రేయోభిలాషి అయిన అమ్మమ్మ నిర్జీవంగా పడుకుని ఉంది. తలవైపు చిన్న ప్రమిదలో దీపం వెలుగుతోంది. చుట్టూ అత్తలు, మామయ్యలు కూర్చుని కన్నీళ్ళు కారుస్తున్నారు.

కూలబడిపోయిన జానకిని అత్త భవాని పొదివి పట్టుకుంది.

తేరుకున్న జానక్కి పుట్టెడు దుఃఖం ఒక్కసారిగా పొంగివచ్చింది.

"అమ్మమ్మా!" అంటూ ఆవిడ శవం మీద పడిపోయింది.

"నన్నేం చేసిపోయావమ్మమ్మా!....ఇంక నాకు దిక్కెవరు? ..అమ్మకన్న ఎక్కువగా పెంచిన నువు నన్నొదిలిపోతే నేనెలా బ్రతకనమ్మమ్మా! గుళ్ళోకెళ్ళేటప్పుడు కూడా తొందరగా రమ్మని చెప్పిన నువ్వు నేను తిరిగి వచ్చేవరకైనా ఆగలేక వెళ్ళిపోయావా?..." హృదయవిదారకంగా ఏడుస్తూన్న ఆ పిల్లని పట్టడం ఎవరివల్లా కాలేదు.

అన్నింటికీ అతీతంగా ఉన్న రాజమ్మగారి భౌతిక కాయం నిద్రపోతున్నట్టుండి, జీవకళ ఉట్టిపడుతోంది!

పెదవులపై చిరునవ్వు చెరగనేలేదు!

రాజమ్మగారింట పండుగ ఛాయలు పోయి ప్రేతకళ ఆవరించింది.

*

బంధువులందరితోపాటు జానకి తండ్రి కూడా వచ్చాడు. అత్తగారికి ధర్మోదకాలు వదలడానికి.

కూతరి మీద అయనకి అంతరంగంలో ఉన్న ప్రేమ పొంగిపొరలింది.

వెళ్ళేముందు జానకి దగ్గరికొచ్చి, ఆమెను పొదివిపట్టుకుని, "రా తల్లీ! మనింటికిపోదాం! అమ్మమ్మ పోయాక ఇంకేముందీ!....పిన్ని కూడా మునుపట్లా అంత కఠినంగా ప్రవర్తించడం లేదు!" ఆప్యాయంగా అన్నాడు.

జానకి నిర్జీవంగా నవ్వింది!

"లేదు నాన్నా!..... నేనెక్కడికీరాను!..... నాకిక్కడ బాగా అలవాటైపోయింది! . అయినా అమ్మమ్మ లేకపోతే మాత్రమేం?........అత్తలు


మీ కేశ సౌందర్యాభివృద్ధికి కొబ్బరినూనె కంటె అతి ఉత్తమమైనదేది?

OBM 6119/TG R



కేశవర్ధినిని

చేర్చిన కొబ్బరినూనె




ఔను! మీరు ప్రతి నిత్యమూ తలకు రాసుకుంటూన్న కొబ్బరినూనెలో కొన్ని చుక్కలు కేశవర్ధినిని కలపండి. తల చర్మానికి అంటేటట్టుగా తలకు రాసుకోండి.
ఇదే అందంగా తల వెంట్రుకలు పెరగడానికి సాంప్రదాయిక రహస్యము–కేశవర్ధిని.
వెంటనే ఒక బాటిల్ కేశవర్ధినిని కొని వాడండి.




కేశవర్ధిని ప్రోడక్ట్స్ (మద్రాసు)
మద్రాసు-600 092

మామయ్యలు లేరూ!... ఇన్నాళ్ళూ వాళ్ళ అంగీకారం లేకపోతే అమ్మమ్మ దగ్గర ఉండగలిగేదాన్నా?'' మెల్లగా అంది.

"అవుననుకో!....కానీ...మీ తమ్ముడువాళ్ల నిన్ను చూడాలని ఎంతగానో అనుకుంటున్నారు!... ఒక్కసారి....''

"అలాగే!....ఎప్పుడైనా ఓసారి వస్తాలే!... అందర్నీ అడిగానని చెప్పు!'' సున్నితంగా తన అసమ్మతిని చెప్పింది జానకి. ఆ పిల్లకి తెలుసు తండ్రి తనని తీసికెడితే, ఆపై ఆయనపడేపాట్లు!

నిట్టూరుస్తూ బైటికెళ్ళిపోయాడు తండ్రి.

పక్కనించి తండ్రీకూతుళ్ళ సంభాషణ విన్న భవాని జానకి దగ్గరకొచ్చి "భలేవాడే! మీ నాన్న! ఇన్నాళ్ళూ లేని ప్రేమ ఇప్పుడు హఠాత్తుగా పుట్టుకొచ్చిందేమిటో!....అయినా చాలా చక్కగా చెప్పావ్ సమాధానం!.....అంతెందుకూ.....మేం లేమూ!....ఇన్నాళ్ళు, కళ్ళలో పెట్టుకుచూసి, ఇప్పుడా ముసలావిడపోతే వదిలేస్తామా?....ఇదిగో జానీ! నువ్వు నాతోపాటు హైదరాబాదొచ్చెయ్యి! బావని చేసుకోవద్దులే!....అంత ఇష్టం లేకపోతే బలవంతంగా కడతామా మేమైనా?'' అభిమానం వలకబోస్తూ అంది భవాని.

"ఒద్దత్తా! నాకిక్కడే ఉండాలనుంది!, ఈ శివాలయం, ఈ పొలాలూ, ఈ పున్నాగచెట్టు చూస్తుంటే నా బాధని కాస్త మర్చిపోగలను'' కళ్ళలో నీరు తిరుగుతూండగా మెల్లగా అంది జానకి.

"అలా కాదు జానీ! అమ్మమ్మ లేని ఈ ఇంట్లో నువ్వసలు ఉండలేవని నాకు తెలుసు!.... ఒంటరిగా ఉన్న నువ్వు మనసు బాగుండక ఏ అఘాయిత్యమైనా చేస్తే?....అమ్మో! నిన్ను ఇక్కడుండనియ్యను!....'' చనువుతో గూడిన స్వరంతో అంది భవాని.

బాధగా నిట్టూర్చింది జానకి.

"అత్తా! మనసెంత చిత్రమైంది.

అమ్మమ్మ పోయినప్పుడు నేనూ చచ్చిపోవాలనుకున్నాను. ఆవిడ లేకుండా ఒక్క క్షణం కూడా ఉండలేననిపించింది. కానీ ఇప్పుడు బ్రతకడం లేదూ? పదమూడు రోజులు గడిచిపోయాయి. నేను పోయానా?

ఆవిడ శవం ఉన్న రాత్రి తప్ప, కనీసం ఒక్క పూట తిండి మానానా? అందుకే అమ్మమ్మ అంటూండేది చచ్చిన రోజు దుఃఖం మర్నాటికుండదు, మర్నాటి దుఃఖం మూడోనాటికుండదు అని.

ఇందులో ఎంత సత్యముంది. కాలం ఎంతటి గాయాన్నైనామాన్పగలదు. అందుకే నేను కొన్నాళ్ళపాటు ఇక్కడే ఉంటాను'' కొనగోటితో కన్నీరు తుడుచుకుంటూ చిన్నత్త పిలుపుతో వంటింటికేసి నడిచింది జానకి.

మిగతా అత్తలు కూడా ఎవరికివారే జానకిని తమ దగ్గరుంచుకోవాలని తెగ ఆరాటపడిపోయారు.

అందరి కోరికల్నీ సున్నితంగా త్రోసిపుచ్చి శారదకి తృప్తినిచ్చింది జానకి.

అంత ప్రేమగా అందరూ ఎందుకు తనని ఆహ్వానిస్తున్నారో జానక్కి బాగా తెలుసు.

"ఎవ్వరికీ తన మీద ప్రేమలేదు. వారి ప్రేమల్లా తన పనిపాటల మీద, తన నిరాడంబరత్వం మీద తను ఇలా వుంటే ఖర్చుండదు. జీతం, భత్యంలేని నౌకరులా వాడుకోవచ్చు!" కసిగా అనుకుంది జానకి.

మర్నాడు ఆస్తి పంపకాలు అయిపోయాయి. రాజమ్మగారి నగలన్నీ నలుగురు కోడళ్ళూ పంచుకోగా ఓ జత గాజులు, ఓ ఒంటి పేట చైనూ, మాత్రం జానక్కి ఇచ్చారు. ఆ పిల్లకి చిన్నప్పుడు చేయించిన నగలు మాత్రం ఎవరూ పంచుకోలేదు. శారద దగ్గరే ఉంచారు.

ఈ పంపకాలతో తనకేమీ నిమిత్తం లేనట్టు నిర్లిప్తంగా ఉండిపోయింది జానకి.

పొలాలన్నీ తమ్ముడి కప్పజెప్పి అన్నలు వెళ్ళిపోయారు.

అందరూ వెళ్ళిపోయాక జానకి మరీ ఒంటరిగా అయిపోయింది.

మంది ఎక్కువ వుండకపోయినా పల్లెపట్టున చాకిరీకి మాత్రం లోటుండదు. పాలేళ్ళకీ, పని పిల్లకీ, చాకలికీ అన్నాలు పెట్టాలి. పొలాలకి కాఫీగ్లాసు పంపాలి. నిలవకూలీలుంటే వారికి బియ్యం కొలవాలి. ఎంత పాలేళ్ళున్నా జానకివన్నీ చాలా జాగ్రత్తగా దగ్గిరుండి చేయించేది.

[సశేషం]

[లోకజ్ఞానం – సమాధానాలు]

1. నాన్‌కింగ్ (చైనా) నగరంలో. 15వ శతాబ్దిలో నిర్మించబడిన ఈ శిఖరంలో ఎనిమిది అంతస్థులు వుండేవి. ఎత్తు 261 అడుగులు. అయితే 1853 లో తైపింగ్ విప్లవకారులు ఈ శిఖరాన్ని తమ విధ్యంస కాండకు గురి చేసి అవశేషాలు మిగిల్చారు.

2. క్రీ. పూ. రెండవ శతాబ్ద కాలంనాటి వ్యాకరణ గ్రంథకర్త. పాణిణి వ్రాసిన వ్యాకరణ గ్రంథానికి 'మహాభాష్యం' పేరిట భాష్యం చెప్పిన వ్యాకరణకారుడు.

3. గాబ్రియెల్ గార్సియా మార్క్వెజ్. కొలంబియా దేశస్థుడు. 'హండ్రెడ్ ఇయర్స్ ఆఫ్ సాలిట్యూడ్' మొదలైన పలు రచనలు చేసిన మార్క్వెజ్ లాటిన్ అమెరికా దేశాలలో సాహిత్య విభాగంలో నోబెల్ బహుమతి పొందిన వారిలో నాల్గవ వ్యక్తి. స్పానిష్ భాషలో రచనలు చేసే ఈయన రచనలు అమ్ముడయినంతగా ఆ భాషలో ఏ ఇతర రచయిత రచనలూ ఈ మధ్య కాలంలో అమ్ముడవలేదు. అయితే స్వదేశంలో మితవాదులవల్ల తన మనుగడకే ముప్పు వాటిల్లడంతో ఆయన చాలాకాలంగా పారిస్, స్పెయిన్, మెక్సికోలలో ప్రవాస జీవితాన్ని గడుపుతున్నారు.

4. యునైటెడ్ నేషనల్ పార్టీకి చెందిన జూనియస్ రిచర్డ్ జయవర్దనే. శ్రీలంకలో అధ్యక్ష పాలనా విధానం ప్రవేశపెట్టిన తరువాత జరిగిన మొదటి ఎన్నికలలో ఈయన తన సమీప ప్రత్యర్థిపై తొమ్మిది లక్షలు ఓట్ల తేడాతో గెలుపొందారు. పదవిలో వున్న వ్యక్తి గెలుపొందడం కూడా అక్కడ ఇరవై ఐదు సంవత్సరాల తర్వాత ఇదే ప్రథమం!

5. మహారాష్ట్రకు చెందిన సంజీవనీ కరణ్‌దికర్.

6. 148.8 మిలియన్ కిలోమీటర్లు.

7. పి. రామచంద్రన్.

8. ఐన్‌థోవెన్. నెదర్‌లాండ్స్ దేశస్థుడు. 1903 లో.

9. బేక్‌లాండ్ (అమెరికా). 1898 లో.

10. 1857. సిపాయిల తిరుగుబాటులేక మొట్ట మొదటి భారత స్వాతంత్ర్య పోరాటం.